నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, మంగళవారం 18 మార్చి 2025 VIKARABAD




పరిశ్రమలు పెట్టనున్న పచ్చని పంటపొలాలు ఇవే..

# ప్రాణాలు పోయినా భూములివ్వం

- పచ్చని పొలాల్లో 'ఫ్యూచర్' చిచ్చు
- ఫ్యూచర్ సిటీ కోసం మొండిగౌరెల్లిలో 821.11 ఎకరాల భూసేకరణ
- పారిశ్రామికవాడ ఏర్పాటుకు కసరత్తు
- ఆందోళనలో రైతులు, గ్రామస్తులు
- గ్రామంలో అన్నదాతల సమావేశం
- లగచర్ల రైతుల స్ఫూర్తిగా ఉద్యమిస్తాం
- భూముల జోలికొస్తే తరిమికొడతామని హెచ్చరిక



మొండిగౌరెల్లి గ్రామంలో సమావేశమైన రైతులు

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మొండిగౌరెల్లి గ్రామ రైతులు కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో సమావేశమై ఫ్యూచర్‌సిటీ పేరిట తమ భూములకు ప్రభుత్వం ఎసరు పెట్టడంపై మండిపడ్డారు. గ్రామ అభివృద్ధి దృష్ట్యా ఫ్యూచర్‌సిటీలో కలపాలని విన్నవిస్తే పట్టించుకోకుండా.. భూములు లాక్కోవాలని చూడటంపై కన్నెర్రజేశారు. ప్రాణాలు పోయినా సరే తమ భూములను ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు గ్రామానికి చెందిన రైతులు తాండ్ర రవీందర్, బండిమీది కృష్ణ, ప్రవీణ్, సంటీప్‌రెడ్డి, రవి తదితర ఐదుగురితో ఓ కమిటీని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. మంగళవారం మరోసారి రైతులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్టు వారు తెలిపారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, ఎమ్మెల్యే, రైతు కమిషన్ చైర్మన్లకు ముందుగా వినతిపత్రాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, రాస్తారోకోల రూపంలో ఆందోళనలు ఉధృతం చేయాలని భావిస్తున్నారు. గ్రామంలో భూసేకరణ, సర్వే కోసం ఎవరూ వచ్చినా లగచర్ల మాదిరిగా తరిమికొట్టాలని, ప్రాణాలు పోయినా సెంటు భూమిని వదులుకోవద్దని మాజీ సర్పంచ్‌లు అంజయ్యయాదవ్, కృష్ణ, నాయకులు రవీందర్, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పిలుపునిచ్చారు. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసేవరకు పోరాడాలని రైతులకు సూచించారు.

- యాచారం, మార్చి 17

### ఫ్యూచర్‌సిటీతో రియల్ వ్యాపారం



ఫ్యూచర్‌సిటీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. పంటలు పండే భూములను తీసుకొని పరిశ్రమలను ఏర్పాటు చేయడం సిగ్గుచేటు. రైతుల భూములను కోట్లకు అమ్ముకొని ఖజానా నింపుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పరితపిస్తున్నది. రైతుల ప్రభుత్వం అంటూ భూములను బలవంతంగా సేకరించాలనుకోవడం ఎంత వరకు సమంజసం? ఇదేనా ప్రజాపాలన?

- మర్పల్లి బాలరాజు, మొండిగౌరెల్లి

మొండిగౌరెల్లి గ్రామ రైతులు ఆకుకూరలు, కూరగాయల సాగులో కొన్నేండ్లుగా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామ రైతులు ఎక్కువగా పూదిన, కొత్తిమీర సాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కూరగాయల సాగును పెంపొందించేందుకు ఇటీవల ఆ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. మొండిగౌరెల్లిని కూరగాయల హబ్‌గా మార్చేందుకు హార్టికల్చర్, అగ్రికల్చర్ విభాగాల సహకారంతో రైతు కమిషన్ ఆధ్వర్యంలో ఇటీవల మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఆ కార్యాచరణ అమల్లోకి రాకముందే ఫ్యూచర్ సిటీ కోసం 821.11 ఎకరాల రైతుల భూములను సేకరిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో రైతులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పచ్చని పంటపొలాల్లో పరిశ్రమలు నిర్మించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గుంట భూమినీ వదిలేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు. రైతు ప్రభుత్వం అంటూనే నమ్మించి అన్నదాతల గొంతు కోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాన్ని కలపాలని కోరితే కలపకుండా.. తమ భూములను లాక్కోవడమేంటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఫార్మాసిటీ కోసం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో పట్టా, అసైన్డ్ భూములను ప్రభుత్వం సేకరించగా.. ఆయా గ్రామాల రైతులు ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్న విషయం తెలిసిందే. కుర్మిద్ద గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు కోసం 144 ఎకరాల భూమిని రైతులు కోల్పోయారు. ఓవైపు ఆ గ్రామ రైతులు ఉద్యమిస్తుండగా.. మరోవైపు మొండిగౌరెల్లిలో భూములను లాక్కోవాలని చూస్తుండటంతో రైతన్నలు రేవంత్ సర్కారుపై కన్నెర్రజేస్తున్నారు.

### 821.11 ఎకరాల సేకరణ..

మొండిగౌరెల్లిలో పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం 19, 68, 127 సర్వే నంబర్లలో 638 మంది రైతులకు చెందిన 821.11 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. సర్వేనంబర్ 19లో 375.27 ఎకరాలు, సర్వేనంబర్ 68లో 188.3 ఎకరాలు, సర్వే నంబర్ 127లో 113.34 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. మొత్తం 676.91 ఎకరాల అసైన్డ్ భూములతో పాటు చుట్టుపక్కల ఉన్న సుమారు మరో 140 ఎకరాల పట్టా భూములను సేకరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. తమ భూములను ప్రభుత్వం తీసుకోవాలని చూస్తున్నదని తెలియడంతో స్థానిక కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

### భూమిపై ఆధారపడి బతుకుతున్నాం..



తరతరాలుగా ఆ భూములను సాగుచేసుకొని బతుకుతున్నాం. ఉన్న భూమి ప్రభుత్వం తీసుకుంటే ఎలా బతకాలి. భూమిని ప్రభుత్వం తీసుకుంటే మాకు జీవనోపాధి కరువవుతుంది. బతుకు భారంగా మారుతుంది. మార్పు కావాలని నమ్మి ఓట్లేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతున్నది. - స్వామి, రైతు, మొండిగౌరెల్లి

### భూములిచ్చేది లేదు..



ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న పారిశ్రామికవాడకు భూములిచ్చేదిలేదు. భూములను సాగు చేసుకొని బతుకీడుస్తున్నాం. బలవంతంగా భూసేకరణ చేపడితే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు. ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి. లేదంటే ఆందోళనలు ఉధృతంగా చేస్తాం.

- నక్క శ్రీనివాస్, మొండిగౌరెల్లి

### భూముల జోలికొస్తే తరిమికొడతాం



భూముల జోలికొస్తే ఎంతటి వారినైనా తరిమి కొడతాం. గ్రామానికి రాకుండా కందకాలు తీసి అడ్డుకుంటాం. లాఠీ దెబ్బలు, పోలీసు కేసులకు భయపడేదిలేదు. జైలుకు వెళ్లడానికైనా సిద్ధం. భూసేకరణను ఆపాలి. లేదంటే లగచర్ల మాదిరిగా ఉద్యమిస్తాం.

- పాండు, మొండిగౌరెల్లి

## చిల్లర పనులు చేస్తే ఛీకొడతారు

- బీఆర్ఎస్ కార్యకర్తలను ఏమీ చేయలేరు
- బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఎక్కువకాలం పోలీసులతో రాజకీయం చేయలేరు
- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలకు పరామర్శ



అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 17 : కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయినా బీఆర్ఎస్ కార్యకర్తలను ఏమీ చేయలేరని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలమంతా కలిసొస్తే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కొట్టుకుపోతారని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మన్సూరాబాద్ డివిజన్‌లో ఈ నెల 12న నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొనలేదు. అవే కార్యక్రమాలను కార్పొరేటర్ సోమవారం నిర్వహిస్తుండగా డివిజన్ బీఆర్ఎస్ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాగరాజు, జగదీశ్ తదితరులు శాంతియుతంగా నిరసనకు దిగారు. వారిని హయత్‌నగర్ పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులను సుధీర్‌రెడ్డి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. చేసిన శంకుస్థాపనలనే కార్పొరేటర్‌లు మళ్లీ చేస్తుండటంతో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులతో దురుసుగా ప్రవర్తించి, పేర్లు అడిగి మరీ కొట్టి, కాళ్లతో తొక్కి, బూతులు తిట్టి, వెటకారంగా మాట్లాడిన హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎక్కువ కాలం పోలీసులతో రాజకీయం చేయలేరని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఇలాంటి చిల్లర పనులు చేసే నాయకులు మరోసారి ఇదే తరహా చేస్తే ప్రజలే తిరగబడతారన్నారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు విఠల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, సాగర్‌రెడ్డి, పద్మానాయక్, భవాని, ఇతరులు ఉన్నారు.

## జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

- బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్
- హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఆమనగల్లు, మార్చి 17 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ సోమవారం పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి దహనం చేశారు. అనంతరం పత్యానాయక్ మాట్లాడుతూ.. రైతులు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో నిలదీయడాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ సర్కార్ మాజీ మంత్రిని సస్పెండ్ చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుమని అడగడం కూడా తప్పా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులు అడిగిన ప్రశ్నలకు పాలకపక్షం బాధ్యతాయుతంగా సమాధానం చెప్పాల్సింది పోయి నిరంకుశంగా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, సీనియర్ నాయకులు బాలస్వామి, పంతూనాయక్, రమేశ్‌నాయక్, ఈశ్వర్ నాయక్, విజయ్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, వెంకటేశ్, రమేశ్‌నాయక్, రమేశ్, శివకుమార్, సైదుల్ గౌడ్, జగన్, గణేశ్, పంతు, శ్రీకాంత్, సోమ్లా, మాల్యా, మణిపాల్, మహేశ్ , హేమ్లా, నిరంజన్, యాదగిరి, చక్రి, జంగయ్య, శ్రీను, గణేశ్ పాల్గొన్నారు.

### దాహం.. దాహం



ధారూరు స్టేషన్ గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. గత మూడు రోజులుగా మెయిన్ రోడ్డు ఎనిమిదో వార్డులో నీటి సరఫరా బంద్ కావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని సోమవారం పలువురు మహిళలు కుళాయి వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తమ వార్డుకు మిషన్ భగీరథ నీరు అసలే సరఫరా కాదని.. ఈ విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– ధారూరు, మార్చి 17



పెద్దఅంబర్‌పేటలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు, రుసుం చెల్లించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే సర్వర్ నెమ్మదిస్తుండటంతో వచ్చినవారు ఇబ్బందులు పడుతున్నారు.

– పెద్దఅంబర్‌పేట, మార్చి 17

## బీసీ నిరుద్యోగులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

సిటీ బ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా ప్రజలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ అందించనున్నట్లు వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య తెలిపారు. నిరుద్యోగ బీసీ యువతకు టీజీఎస్ ఆర్టీసీ హకీంపేటలో ఈ శిక్షణను ఇవ్వనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ మోటార్ వాహనం, తేలికపాటి మోటార్ వాహనం నడిపేందుకు 38 రోజుల పాటు శిక్షణతో పాటు భోజనం, వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎనిమిదో తరగతి చదివిన 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వారు దరఖాస్తు పత్రాలను సంబంధిత జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 31 లోపు అందజేయాలని సూచించారు. ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.






మునుగనూరు సర్వే నం.90లో నిర్మించిన ఇండ్లు

## విచారణ జరిపి నివేదిక ఇవ్వాలి

- రూ.50 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని కోర్టును ఆశ్రయించిన పూజారి
- ఆలయ నిర్మాణం కోసం తాను కొనుగోలు చేసిన స్థలాన్ని కూడా ఆక్రమించారని ఆరోపణ
- రెవెన్యూ, పురపాలకశాఖ కార్యదర్శులకు కోర్టు నోటీసులు

రంగారెడ్డి, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డిజిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునుగనూరు గ్రామంలోని ప్రభుత్వ భూమి వ్యవహారం మరోమారు తెరమీదకు వచ్చింది. మునుగనూరు గ్రామంలోని సర్వేనెంబర్ 90లో 6.20ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో 2ఎకరాలను క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. మిగిలిన 4.20 ఎకరాల్లో కొంతమంది 54 ఇండ్లు నిర్మించారు. ఇదే భూమి పక్కన రామశర్మ అనే పూజారి కాశీ విశ్వనాథ ఆలయం నిర్మించడానికి 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఈ స్థలంలో నిర్మించిన ఇండ్లతో పాటు తన స్థలాన్ని కూడా కొందరు ఆక్రమించారని పూజారి హైకోర్టును ఆశ్రయించాడు. సుమారు రూ.50కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని.. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని పూజారి హైకోర్టును కోరాడు. దీంతో హైకోర్టు పూజారి వాదనలు విని రెవెన్యూ, పురపాలక ముఖ్య కార్యదర్శులకు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సోమవారం నోటీసులు జారీచేసింది. దీంతో మునుగనూరు భూముల వ్యవహారం మరోమారు తెరమీదకు వచ్చింది. ఈ భూమిలో అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో 54 ఇండ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ ఇండ్లలో స్థిర నివాసం కూడా ఉంటున్నారు. దీనిపై హైకోర్టు స్పందించటంతో మారుమారు ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



ఆలయ నిర్మాణం కోసం బోర్డు ఏర్పాటు చేసిన పూజారి

## కరెంట్ కోతలతో కన్నీళ్లే మిగిలాయి..

- అధికారికంగా నాలుగున్నర గంటలు
- అనధికారికంగా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని వైనం
- 13.50 మీటర్ల మేర అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండిపోతున్న పంటలు
- జిల్లావ్యాప్తంగా 90 వేల ఎకరాల్లో వరి సాగు
- 20 వేల ఎకరాల వరకు పంటలు ఎండుముఖం
- మరో వారం రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం
- దిక్కులేని స్థితిలో పశువులకు మేతగా వరి
- అప్పులు చేసి సాగు చేసినా ఫలితం లేక పుట్టెడు దుఃఖంలో రైతన్న
- ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్న అన్నదాతలు



### రేవంత్‌రెడ్డి రైతుల్ని ఆగం చేసిండు..

అధిక వడ్డీకి అప్పు చేసి నాలుగు ఎకరాల్లో వరి పంట వేస్తే మూడెకరాల్లో పంట పూర్తిగా ఎండిపోగా.. మరో ఎకరా పంట కూడా వారం రోజుల్లో ఎండిపోయే పరిస్థితులున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా పోయి, లగోడి కూడా మీద పడింది. గత పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా పరిస్థితి దాపురించింది. కనీసం తినడానికి కూడా దిగుబడి రాలేదు. అప్పులు ఇచ్చిన వ్యక్తి అప్పు చెల్లించాలని బలవంతం చేస్తే మా కుటుంబానికి ఆత్మహత్యలే శరణ్యం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చెరువుల్లో పూడికతీత పనులతో చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండేది, భూగర్భజలాలు సరిపోను ఉండి యాసంగిలోనూ గుంట పంట నష్టపోకుండా పంటలు పండేవి. 24 గంటల కరెంట్ ఉంటుండే, ఏ సమయంలో చేనుకెళ్లి బోరు వేసినా పంటలకు నీరు పారేది. రాత్రి సమయంలో విద్యుత్తు షాక్‌లు, పాముకాటుకు గురై మృతిచెందిన సంఘటనలు లేకుండాపోయాయి. అయితే రేవంత్‌రెడ్డిని నమ్మి ఓటేస్తే రైతుల్ని మోసం చేసి ఆగం చేసిండు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంట్ ఉంటలేదు. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు. కరెంట్ ఎప్పుడొస్తదా అని పొలం వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. మాకు లాగోడికి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయానికి ముందే కేసీఆర్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని జమ చేసేది. అప్పులు చేసుడు అనేది మరిచిపోయినం. కేసీఆర్ కంటే ఎక్కువ పెట్టుబడి సాయం ఇస్తామంటే నమ్మి కాంగ్రెస్‌కు ఓటేస్తే గెలిచినంక ఏడాదికి కొంత మంది రైతులకే పెట్టుబడి సాయాన్ని వేసిండు. నాలుగు ఎకరాలున్న నాలాంటి రైతులకు ఇంకా పెట్టుబడి సాయాన్ని అందించలేదు. లాగోడికి పైసలు ఇయ్యకుండా, కరెంట్ ఇయ్యకుండా, రైతులను ఆదుకోకుండా రేవంత్‌రెడ్డి ఆగం చేసిండు. రైతులను రోడ్డున పడేసిన రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతాం.

- దేవులానాయక్, పులిచింతలమడుగుతండా, ధారూరు మండలం

జిల్లాలో గతంలో ఎన్నడూలేని విధంగా భూగర్భజలాలు తగ్గడంతోపాటు కరెంట్ కోతలతో వరి పంట ఎండుముఖం పడుతున్నది. వరి సాగు చేసిన భూములు నీళ్లు లేక నెర్రెలు తేలిన దయనీయ పరిస్థితులు జిల్లాలో ఎక్కడా చూసినా కనిపిస్తున్నాయి. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టడంతో పుట్టెడు దుఃఖంలో జిల్లా రైతాంగం మునిగిపోయింది. జిల్లావ్యాప్తంగా 90వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, ఇప్పటివరకు దాదాపు 20వేల ఎకరాల వరకు వరి పంట ఎండుముఖం పట్టినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరో వారం రోజులైతే సాగు చేసిన వరి పంటలో సగానికిపైగా ఎండిపోయే పరిస్థితులున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎండుముఖంపట్టిన వరి పంటను కొందరు రైతులు ఆశలు వదులుకొని పశువులకు మేత కోసం వదులుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాలేని పరిస్థితితో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో భూగర్భజలాలు కూడా 13.50 మీటర్ల లోతుకు అడుగంటిపోవడంతో బోర్లలో నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. దీనికి కరెంట్ కోతలు ఉండడంతో వేసిన పంటలో 25 శాతం పంటలనైనా కాపాడుకోవచ్చు అనుకున్న రైతుల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లి అధికారికంగా నాలుగున్నర గంటలకుపైగా విద్యుత్తు సరఫరాకు కోతలు విధిస్తూ, అనధికారికంగా ఓవర్ లోడ్ పేరిట ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నది.

- వికారాబాద్, మార్చి 17, (నమస్తే తెలంగాణ)